




# కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక

సంపుటి : 7 సంచిక : 285

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 23 మార్చి 2024


## టీడీపీ మూడో జాబితా విడుదల



**అమరావతి,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల మూడో జాబితా విడుదలైంది. 11 శాసనసభ స్థానాలతో పాటు 13 ఎంపీ అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. పొత్తులో భాగంగా 144 అసెంబ్లీ, 17 పార్లమెంట్ స్థానాల్లో టీడీపీ పోటీ చేయనుంది. ఇదివరకే 128 శాసనసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా తాజాగా మరో 11 మందిని వెల్లడించింది. 5 అసెంబ్లీ, 4 ఎంపీ స్థానాలను పెండింగులో ఉంచింది.

**ప్రజలంతా ఆశీర్వదించాలి : చంద్రబాబు నాయుడు**

టీడీపీ మూడో జాబితా విడుదల చేసిన సందర్భంగా పార్టీ అధినేత చంద్రబాబు ఎక్స్(ట్విటర్) వేదికగా పోస్టు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే ఏకైక ఎజెండాగా ఎన్డీఏలో చేరినట్లు తెలిపారు. పార్లమెంటులో బలమైన గళం వినిపించి రాష్ట్రం కోసం పోరాడగల నాయకులనే అభ్యర్థులుగా నిలబెడుతున్నట్లు చెప్పారు. ప్రజాభిప్రాయం మేరకు ఎంపిక చేసి ప్రకటిస్తున్నామని, ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాలే ఏకైక ఎజెండా లక్ష్యంగా ఎన్డీయే లో చేరామని, పార్లమెంటులో బలమైన గళం వినిపిస్తూ రాష్ట్రం కోసం పోరాడగల నాయకులనే టీడీపీ అభ్యర్థులుగా నిలబెడుతున్నామని తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పార్లమెంటుకు పోటీ చేసే 13 మంది తెలుగుదేశం ఎంపీ అభ్యర్థులను, వారితో పాటు మరో 11 అసెంబ్లీ స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రజాభిప్రాయం మేరకు ఎంపిక చేసి ప్రకటించామని తెలిపారు. ప్రజలారా ఆశీర్వదించాలని చంద్రబాబు కోరారు.

**అసెంబ్లీ స్థానాల అభ్యర్థులు :** పలాస–గౌతు శిరీష, పాతపట్నం–మామిడి గోవిందరావు, శ్రీకాకుళం–గొండు శంకర్, శృంగవరపుకోట– కోళ్ల లలిత కుమారి, కాకినాడ సిటీ– వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), అమలాపురం (ఎస్సీ)– అయితాబత్తుల ఆనందరావు, పెనమలూరు–బోడె ప్రసాద్, మైలవరం– వసంత వెంకట కృష్ణప్రసాద్, నరసరావుపేట– చదలవాడ అరవిందబాబు, చీరాల– మద్దులూరి మాలకొండయ్య యాదవ్, సర్వేపల్లి– సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ని ప్రకటించారు.

**లోక్‌సభ స్థానాల అభ్యర్థులు వీరే :** శ్రీకాకుళం– కింజరాపు రామ్మోహన్ నాయుడు, విశాఖపట్నం– మతుకుమిల్లి భరత్, అమలాపురం– గంటి హరీష్, ఏలూరు – పుట్టా మహేశ్ యాదవ్, విజయవాడ– కేశినేని శివనాథ్ (చిన్ని), గుంటూరు– పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట– లావు శ్రీకృష్ణ దేవరాయలు, బాపట్ల– టి.కృష్ణ ప్రసాద్, నెల్లూరు– వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, చిత్తూరు– దగ్గుమళ్ల ప్రసాదరావు, కర్నూలు– బస్తిపాటి నాగరాజు (పంచలింగాల నాగరాజు), నంద్యాల– బైరెడ్డి శబరి, హిందూపురం– బీకే పార్థసారథి ని ప్రకటించారు.

## ప్రధాని నరేంద్ర మోడీ కి భూటాన్ అత్యున్నత పౌర పురస్కారం



● తొలి విదేశీ ప్రభుత్వాధినేతగా ఘనత

**న్యూఢిల్లీ, కలంకౌంటర్ :** భారత ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం భూటాన్ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది డ్రూక్ గ్యాల్పో'ను అందుకున్నారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్ దీన్ని ప్రదానం చేశారు. దీంతో ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి విదేశీ ప్రభుత్వాధినేతగా నిలిచారు. ఈ అవార్డును మోదీకి 2021లోనే ప్రకటించారు. ఇరుదేశాల సంబంధాలను బలోపేతం చేయడంతోపాటు కొవిడ్ సమయంలో 5 లక్షల టీకాలను అందజేయడం వంటి చర్యలకు గుర్తింపుగా ఇచ్చారు. ఈ అవార్డు అందుకోవడం గౌరవంగా ఉందని, దీన్ని 140 కోట్ల మంది భారతీయులకు అంకితం ఇస్తున్నట్లు ప్రధాని తెలిపారు. భూటాన్ ప్రధాని దాషో షెరింగ్ తోబ్గేతో ప్రధాని ద్వైపాక్షిక చర్చలు జరిపారు. పునరుత్పాదక ఇంధనం, వ్యవసాయం, పర్యావరణం, పర్యటకం తదితర రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించుకోవడంపై అవగాహన కుదుర్చుకున్నారు. రెండు రోజుల అధికార పర్యటనకు ప్రధాని మోదీ శుక్రవారం ఉదయం భూటాన్‌కు చేరుకున్నారు. వాస్తవానికి నిన్ననే ఈ పర్యటన ప్రారంభం కావాల్సింది. అనివార్య కారణాలతో ఒకరోజు జాప్యం జరిగింది. 2014లో భారత ప్రధానిగా అధికారం చేపట్టినప్పటినుంచి ఈ దేశంలో పర్యటించడం ఇది మూడోసారి. థింపూలో భారత నిధులతో నిర్మించిన ఆస్పత్రిని ప్రారంభించనున్నారు.

## ఉపాధి హామీ పనుల కల్పనలో ఇబ్బంది లేకుండా చూడండి

● సమ్మర్ స్టోరేజి ట్యాంకులన్నీ సమీప నీటి సోర్సుల ద్వారా పూర్తిగా నిటితో నింపాలి ● ప్రవేట్ బోరులను అద్దె ప్రాతిపదికన తీసుకుని ప్రజల దాహార్తిని తీర్చాలి ● తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన పెంచాలి ● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి



**వెలగపూడి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ముఖ్యంగా కరువు మండలాల్లో ఎక్కడా తాగునీరు,ఉపాధి హామీ పనుల కల్పనలో ఇబ్బం దులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్. జవహర్ రెడ్డి జిల్లా కలక్టర్లను ఆదేశించారు. కరువు మండలాల్లో ఉపాధి హామీ పనులు, తాగునీటి సరఫరా అంశాలపై శుక్రవారం వెలగపూడి సచివాలయం నుండి ఎన్టిఆర్, ప్రకాశం, కర్నూలు, అనంతపురం,శ్రీ సత్యసాయి,నెల్లూరు, నంద్యాల,అన్నమయ్య, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు,పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి, జల వనరులు, విపత్తుల నిర్వహణ శాఖల అధికారులతో సిఎస్ సమీక్షించారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ జూన్ నెలాఖరు వరకు కరువు మండలాల్లో తాగునీటి కొరత లేకుండా చూడడం తోపాటు పెద్ద ఎత్తున ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు. వేసవి ఎండల దృష్ట్యా ఉపాధి హామీ పథకం పనులను ఉదయం 5.30 గం.ల నుండి ఉ.10.30 గం.ల వరకూ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సిఎస్ ఆదేశించారు. నీటి ఎద్దడి గల ఆవాసాలకు ట్యాంకులు ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని కలక్టర్లను సిఎస్ ఆదేశించారు. ట్యాంకులు ద్వారా నీటిసరఫరాను పర్యవేక్షించేందుకు వచ్చే వారానికి ప్రత్యేక యాప్ ను కూడా అందుబాటులోకి తేనున్నట్టు చెప్పారు. కరువు మండలా ల్లోని సమ్మర్ స్టోరేటి ట్యాంకులన్నిటినీ సమీప నీటి సోర్సుల ద్వారా నీటిని మళ్ళించి వాటిని పూర్తిగా నీటితో నింపాలని ఆదేశించారు. వివిధ ప్రవేట్ బోర్లను అద్దె ప్రాతిపదికన తీసుకుని నీటి ఎద్దడి గల ఆవాసాలకు తాగునీటిని సరఫరా చేయాలని స్పష్టం చేశారు. భూగర్భ జల మట్టాలను నిరంతరం మానిటర్ చేస్తూ తీవ్ర నీటి ఎద్దడి గల ప్రాంతాలకు ప్రతిరోజు ట్యాంకులు ద్వారా మంచినీటి సరఫరా చేయాలని చెప్పారు.ట్యాంకరుల ద్వారా నీటి సరఫరాకు సంబంధించి ప్రత్యేకంగా ఎస్ఓపి రూపొందించి సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని ఆదేశించారు.తాగునీటిని దుర్వినియోగం చేయకుండా జిల్లాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. 80 శాతం పైగా పనులు పూర్తయిన వివిధ మంచినీటి పథకాలను యుద్ధ ప్రాతి పదిక పూర్తి చేసి వాటిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని సిఎస్ జవహర్ రెడ్డి కలక్టర్లకు స్పష్టం చేశారు.వీటికి సంబంధించి ఎలాంటి నిధుల కొరత ఉండబోదని స్పష్టం చేశారు. మల్టీ విలేజి , సింగిల్ విలేజి మంచినీటి సరఫరా పథకాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చిన్నపాటి మర్మత్తులు ఉంటే నిర్వహించి అవి సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులతో పాటు కలక్టర్లను సిఎస్ ఆదేశించారు. తాగునీటి సరఫరాకు సంబంధించి తాగునీటి వనరుల వారీగా కార్యాచరణ సిద్ధం చేసుకుని నిరంతరం మానిటర్ చేయాలని సిఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. తాగునీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు.

## పిఠాపురం నుంచే పవన్ కల్యాణ్ ప్రచారానికి శ్రీకారం





**మంగళగిరి,కలంకౌంటర్ :** జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ చేపట్టే ఎన్నికల ప్రచారానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. శుక్రవారం పార్టీ ముఖ్యులతో ఈ అంశంపై చర్చించారు. పవన్ కల్యాణ్ పోటీ చేయనున్న పిఠాపురం నుంచే ప్రచారానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకున్నారు. శక్తిపీఠం కొలువైన క్షేత్రం శ్రీపాద శ్రీవల్లభుడు జన్మించిన పవిత్ర భూమి అయిన పిఠాపురం నుంచి ప్రచారం మొదలుపెట్టడం శుభప్రదమని పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. పురుహూతిక దేవికి పూజలు నిర్వహించి వారాహి వాహనం నుంచి ప్రచారం మొదలుపెడతారు. ఆ నియోజక వర్గంలోనే మూడు రోజులపాటు ఉంటారు. నియోజక వర్గ ముఖ్య నాయకులు, మండల నాయకులతో భేటీలు నిర్వహిస్తారు. పిఠాపురం కేంద్రంగానే రాష్ట్రవ్యాప్తంగా సాగించే ఎన్నికల ప్రచారానికి రాకపోకలు సాగించబోతున్నారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని పవన్ కల్యాణ్ పార్టీ కేంద్ర కార్యాలయ వర్గాలకు ఆదేశాలిచ్చారు. అనంతరం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పార్టీ ప్రెసిడెంట్ టూర్ మేనేజ్మెంట్ టీం కన్వీనర్లు, కో కన్వీనర్లు, సభ్యులతో శ్రీ పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. పిఠాపురం నుంచి మొదలుపెట్టనున్న ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. తాను పోటీ చేస్తున్న స్థానం కావడంతో వైసీపీ ఎన్నో పన్నాగాలు పన్నుతోందని, ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి. ఇందుకోసం సాగిస్తున్న ఈ సమరంలో కచ్చితంగా విజయం మనదే అని చెప్పారు. పిఠాపురం నుంచే జనసేన శంఖం పూరిస్తుందని, ఈ విజయ నాదం రాష్ట్రం నాలుగు వైపులా వినిపించాలన్నారు. ఎన్నికల నియమనిబంధనలు పాటించడంపైనా టూర్ మేనేజ్మెంట్ సభ్యులు పూర్తి అవగాహనతో ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షులు బి.మహేందర్ రెడ్డి, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కళ్యాణం శివ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## డ్రగ్స్ కంటైనర్ చంద్రబాబు బంధువులదే..

● ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



**గుంటూరు,కలంకౌంటర్ :** విశాఖ డ్రగ్స్ విషయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. డ్రగ్స్ విషయంలో బీజేపీ, టీడీపీ నేతల పాత్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. తప్పించుకోవడానికే ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని అన్నారు. శుక్రవారం తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ "విశాఖ పోర్టులో సీబీఐ డ్రగ్స్‌ను సీజ్ చేసింది. పురంధేశ్వరి బంధువులకు ఆ కంపెనీతో సంబంధాలు ఉన్నాయి. టీడీపీ నేతలు కావాలనే మాపై ఆరోపణలు చేస్తున్నారు. చంద్రబాబు ఇంగితం లేకుండా మాట్లాడుతున్నారు. వ్యవస్థల మీద గౌరవం లేని వ్యక్తి చంద్రబాబు. వీధి స్థాయి మనస్తత్వం చంద్రబాబుది. తప్పుడు చేయడం టీడీపీకి అలవాటుగా మారింది. గత ప్రభుత్వ హయాంలో గంజాయి, డ్రగ్స్‌పై తూతు మంత్రంగా దాడుల చేశారు. డ్రగ్స్ నిందితులకు టీడీపీ నేతలతో సంబంధాలు ఉన్నాయి. తప్పు చేసి రివర్స్‌లో మాపైనే ఆరోపణలు చేస్తున్నారు. తప్పించుకోవడానికే మాపై నిందలు వేస్తున్నారు. మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని చంద్రబాబు కలలు కంటున్నారు. వైఎస్సార్‌సీపీకి జనాల్లో విపరీతమైన ఆదరణ ఉంది. అది తట్టుకోలేకపోతున్నారు. వాళ్లకు చెప్పుకోవడానికి ఏమీ లేక ఇలాంటి ప్రచారం చేస్తున్నారు. డ్రగ్స్ విషయంలో నిజాలు నిగ్గు తేల్చాలని సీబీఐకి లేఖ రాస్తాం. ఎన్నికల మిషన్ కూడా డ్రగ్స్‌పై దృష్టి పెట్టాలని కోరతాం. ప్రజలను కన్ఫ్యూజ్ చేసి పబ్బం గడుపుకోవాలని టీడీపీ ప్రయత్నిస్తోందని సజ్జల మండిపడ్డారు.

## ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు 6 రోజుల పాటు ఈడీ కస్టడీ విధించిన కోర్టు



**న్యూఢిల్లీ,కలంకౌంటర్ :** ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను రౌస్ అవెన్యూ కోర్టు 6 రోజుల ఈడీ కస్టడీకి అప్పగించింది. ఈ నెల 28వ తేదీ వరకు కేజ్రీవాల్‌ను ఈడీ విచారించనుంది. ఢిల్లీ మద్యం కేసులో ఈడీ ఆయనను నిన్న సాయంత్రం రెండు గంటల పాటు విచారించింది. అనంతరం రాత్రి అరెస్ట్ చేసింది. ఈడీ ఆయనను పది రోజుల పాటు కస్టడీకి అడిగింది. ఇరువైపుల వాదనలు విన్న అనంతరం ఆరు రోజుల పాటు ఈడీ కస్టడీకి అప్పగించింది. అరవింద్ కేజ్రీవాల్ తరఫు న్యాయవాది మదన్ లాల్ మాట్లాడుతూ... కేజ్రీవాల్‌ను ఈడీ పది రోజుల కస్టడీకి అడిగిందని, మనీ ట్రేస్ చేయడానికి ఈ కస్టోడియలం అవసరమని కోర్టుకు తెలిపిందని... అన్ని కోణాలను పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం ఆరు రోజుల కస్టోడియల్ రిమాండ్‌కు ఇచ్చిందన్నారు. గోవా ఎన్నికల్లో ఉపయోగించిన డబ్బు అక్రమమేనని ఈడీ కోర్టుకు వాదనలు వినిపించినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి తమ వద్ద సాక్ష్యాలు ఉన్నాయని ఈడీ చెబుతోందని తెలిపారు.

## తెలుగుజాతిని నెం.1గా నిలపడమే చంద్రబాబు విజన్ - యువనేత నారా లోకేష్







**మంగళగిరి,కలంకౌంటర్ :** ప్రపంచంలో తెలుగువారు ఎక్కడ ఉన్నా నెం.1గా నిలపాలన్నదే చంద్రబాబు నాయుడు ఆలోచన అని, ఇందు కోసం ఆయన అహర్నిశలు కృషిచేస్తూనే ఉంటారని యువనేత నారా లోకేష్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి పిఇపిఎల్ టవర్స్ అపార్ట్ మెంట్ వాసులతో యువనేత శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ చంద్రబాబు రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధికి కృషిచేశారని తెలిపారు. ఆయనకు జగన్ లా డబ్బు సంపాదించాలన్న కోరిక ఉంటే ఆనాడే వెయ్యి ఎకరాలు కొనేసి ఉండేవారన్నారు. కుల,మతాలకు అతీతంగా పనిచేసేవారిని చంద్రబాబు ప్రోత్సహిస్తారని, నాడు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు హైదరాబాద్ లో ఎమ్మెల్యే ఆర్కే సోదరుడు అయోధ్యరామిరెడ్డికి చెందిన రాంకీ సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ సంస్థను ప్రోత్సహించింది చంద్రబాబేనని గుర్తుచేశారు. హైదరాబాద్ అభివృద్ధిని చూసి ప్రపంచమంతా ఆశ్చర్యపోయారు, ఈ విషయంలో ఆనాడే బాబుకు స్పష్టమైన విజన్ ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డి అయిదేళ్ల విధ్వంసక పాలనలో రాష్ట్రం 30ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆవేదన చెందారు. 2014లో రాష్ట్రవిభజన ఆంధ్రులు కోరుకున్నది కాదు. రాజకీయాల కోసం అడ్డగోలుగా విభజించారు. ఆరుదశాబ్దాలు కలసి అభివృద్ధి చేసుకున్న హైదరాబాద్ ను వదలి కట్టుబట్టలతో ఆనాడు బయటకు వచ్చాం. క్లిష్టపరిస్థితుల్లో సిఎం అయిన చంద్రబాబు అన్నివిధాలా ఆలోచించి అమరావతిని రాజధానిగా నిర్ణయించారు. నాడు ప్రతిపక్షనేతగా ఉన్న జగన్ కూడా ఆనాడు అమరావతి రాజధానికి అంగీకరించి 30వేల ఎకరాలు ఉండాలన్నారు. అధికారంలోకి వచ్చాక మాటతప్పి మడమతిప్పి మూడుముక్కలాట పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. అమరావతిలో ఎక్కడి పనులను అక్కడే నిలిపివేశారు. ఉద్యోగాల కోసం మన బిడ్డలు హైదరాబాద్, బెంగుళూరు, చెన్నయ్ ప్రాంతాలకు వలసవెళ్లాల్సిన దుస్థితి కల్పించారని మండిపడ్డారు. కులం, మతం, ప్రాంతం పేరుతో గత ఎన్నికల్లో జగన్ లబ్ధిపొందారు, కుట్రపూరిత రాజకీయాలతో సమాజం నిట్టనిలువునా చీల్చిపోయింది. ప్రతిపక్షనేతలను బూతులు తిట్టేవారికి మంత్రి పదవులు, ఎమ్మెల్యే, ఎంపి టిక్కెట్లు ఇస్తున్నారు. చంద్రబాబు నాయుడు ఏనాడు హత్యారాజకీయాలను ప్రోత్సహించలేదు, కత్తిపట్టిన వాడు కత్తితోనే పోతాడనే నానుడిని ఆయన బలంగా విశ్వసిస్తారు. చంద్రబాబును అరెస్టు చేస్తే 80దేశాల్లో తెలుగువారు ఆందోళనల్లో పాల్గొన్నారు, హైదరాబాద్ లో 45వేలమంది రోడ్లపైకి వచ్చి ఆయనకు సంఘీభావం తెలిపారు. పవన్ కళ్యాణ్ ను రెచ్చగొట్టి పొత్తును విచ్ఛిన్నం చేయాలని కొందరు ప్రయత్నించారు, సాధ్యం కాకపోయే సరికి ముసుగుతీసేసి వైసిపిలో చేరారు. అటువంటి నేతలకు విశ్వసనీయత ఏముంటుందని ప్రశ్నించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రజలంతా చంద్రబాబు నాయకత్వాన్ని బలపర్చాలని లోకేష్ విజ్ఞప్తిచేశారు.

# సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 10 విద్యార్థులకు మ్యాంగో జ్యూస్ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ బాలాజీ విద్యాలయంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు శుక్రవారం చల్లటి మ్యాంగో జ్యూస్ అందించారు. ఎండ తీవ్రత నుండి ఉపశమనం కలిగించడానికి విద్యార్థులకు చల్లని పానీయం పంపిణీ చేస్తున్నట్లు సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్ తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగవిభాగం సమన్వయకర్త టి.సాయి కృష్ణ చైతన్య, జిల్లా ఐటీ సమన్వయకర్త నరేంద్ర, సమితి సేవాదళ్ సమన్వయకర్త కె అనిల్ పాల్గొన్నారు.

# ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు - జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



**బాపట్ల, కలంకౌంటర్ :** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా ప్రకటించారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడానికి కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రజలు ఎప్పుడైనా ఈ ఫోన్ నెంబర్ల ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీ కంట్రోల్ రూమ్ ఆడిట్ ఆఫీస్ లో ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. గ్రీవెన్స్ కమిటీ కంట్రోల్ రూమ్ 08643 297801 నిరంతరం అందుబాటులో ఉంటుందన్నారు. 1950 ఓటర్ హెల్ప్ లైన్ కలెక్టరేట్ లోని రూమ్ నెంబర్ 36 లో ఏర్పాటు చేశామని, 08643 297802 ఫోన్ నెంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, సి-విజిల్ యాప్ అమలుపై కలెక్టరేట్ లోని రూమ్ నెంబర్ 36 లో 08643 297804 ఫోన్ నెంబర్ కు ఫిర్యాదులు చేయవచ్చన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని డి ఆర్ సి హాల్లో మీడియా సెల్ సోషల్ మీడియా సెల్ ఏర్పాటు చేశామన్నారు. 24 గంటల పాటు పనిచేసేలా 08643 297808 ఫోన్ నెంబర్ సిద్ధంగా ఉంచామన్నారు. వెబ్ కాస్టింగ్ వీడియోగ్రఫీ కొరకు డి ఆర్ సి హాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 08643 297811 ఫోన్ నెంబర్ అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, స్పష్టమైన వివరాలతో కంట్రోల్ రూమ్ కి సమాచారం అందించవచ్చని జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా తెలిపారు.

# నూరు శాతం పోలింగ్ లక్ష్యంగా నిఘా వేదిక కృషి

● రాష్ట్ర కోఆర్డినేటర్ - కర్లపాటి




**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** ఓటింగ్ శాతం ప్రధానంగా పట్టణ ప్రాంతంలో పెంచడమే లక్ష్యంగా ఎన్నికల నిఘా వేదిక కృషి చేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. తమ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నిఘా వేదిక ఓటు విలువ, ఓటు హక్కు వినియోగం , పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం యొక్క ఆవశ్యకతపై ప్రజలను చైతన్య పరు-స్తుందని తెలిపారు. స్వేచ్ఛాయుత ఎన్నికల లక్ష్యమే నిఘా వేదిక కృషి చేస్తుందని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలపై అవగాహన కలగజేయటం, ఎన్నికల ప్రక్రియలో మౌలిక సదుపాయాల కలపనను పరిశీలించి లోపాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం తదితర కార్యక్రమాల్ని చేపడుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో సుమారు 100 స్వచ్ఛంద సంస్థలు అనేకమంది ప్రజాస్వామ్య పరిరక్షణ వాదుల ఐక్యవేదికగా ఈ నిఘా వేదిక కృషి చేస్తుందని ఆయన వివరించారు. గడిచిన మూడు దశాబ్దాలుగా నిఘా వేదిక కార్యక్రమాలను నిర్వహిస్తుందని విశదీకరించారు. ఎన్నికల నిర్వహణలో అనేక సంస్కరణలు కూడా నిఘా వేదిక పలు సందర్భాల్లో ప్రతిపాదించిందని ఆయన తెలిపారు.

# మాఫియా ముఠాలను పెంచి పోషిస్తున్నారు : చంద్రబాబు సతీమణి భువనేశ్వరి





**కడప,కలంకౌంటర్ :** వైసీపీ ప్రభుత్వం మాఫియా ముఠాలను పెంచి పోషిస్తుందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి అన్నారు. "నిజం గెలవాలి" యాత్రలో భాగంగా కడప జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో భువనేశ్వరి పర్యటించారు. చంద్రబాబు అరెస్ట్‌తో మనస్తాపం చెందిన మరణించిన వారి కుటుంబాలను ఆమె పరామర్శిస్తున్నారు. "నిజం గెలవాలి" పేరుతో చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శిస్తూ ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పర్యటించిన ఆమె పలువురు కార్యకర్తల కుటుంబాలను కలిశారు. శుక్రవారం కలసపాడు మండలం బ్రాహ్మణపల్లెలో వెంకటయ్య కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ నాడు చంద్రబాబు జనం మరచి పోలేని అభివృద్ధి పనులు చేశారని చెప్పారు. నేడు జగన్ పాలనలో గంజాయి, ఇసుక , కల్తీమద్యం, మాఫియాలతో పాటు భూకబ్జాలకు అడ్డగా రాష్ట్రం మారిందని మండిపడ్డారు. ప్రస్తుతం తప్పుడు పనుల్లో ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉందని అన్నారు. చంద్రబాబు అమలు చేసిన మంచి పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జగన్, ఆయన అనుచరులకు పనికి వచ్చే పథకాలను ఇప్పుడు అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు చేసిన అభివృద్ధిని చూసి రాబోయే ఎన్నికల్లో ఓటు వేయాలని నారా భువనేశ్వరి పేర్కొన్నారు.

# వైయస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన చరిత్ర పుటల్లో నిలుస్తుంది - ఉప్పాల రమేష్ (రాము)



**పెడన (కృష్ణా జిల్లా),కలంకౌంటర్ :** వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలుస్తుందని ,ఆయన పరిపాలనలో పేద మధ్య తరగతి వర్గ ప్రజలు ఆర్థికంగా బలోపేతం చెందారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల (రమేష్) రాము పేర్కొన్నారు. పెడన పట్టణంలోని 1వ వార్డుకొత్తపేట ప్రాంతం నుంచి శుక్రవారం ఉప్పాల రాము స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. తొలుత కొత్తపేటలో కొలువై ఉన్న శ్రీ పైడమ్మ అమ్మవారి దేవస్థానములో స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కృష్ణా జడ్పీ చైర్మన్ ఉప్పాల హారికతో కలిసి ఉప్పాల రాము ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజా దీవెనలో భాగంగా ఉప్పాల రాము ఇంటింటికి వెళ్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పాల రాము మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు, వైయస్సార్ పెన్షన్ కానుక, అమ్మఒడి, ఫీజు రీయింబర్స్మెంట్, వైయస్సార్ ఆసరా, మద్యపాన నియంత్రణ, జలయజ్ఞం, వైయస్సార్ చేయూత, ఆరోగ్యశ్రీ, వైయస్సార్ రైతు భరోసా వంటి ప్రజా సంక్షేమ పథకాలు భారతదేశంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి తప్ప ఏ ముఖ్యమంత్రి అమలు చేయట్లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న నవరత్నాలు పథకాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సామాన్య, మధ్యతరగతి వర్గ ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. వైఎస్ జగన్ మరో మారు ముఖ్యమంత్రి అయితే నవరత్నాల పథకాలు యధావిధిగా కొనసాగుతా యని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో పెడన నియోజవర్గ ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైయస్ జగన్ ను రెండో దఫా ముఖ్యమంత్రి చేయాలని ఉప్పాల రాము విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెడన మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగ కుమారి ప్రసాద్, వైస్ చైర్మన్లు మొహమ్మద్ ఖాజా, బైలపాటి జ్యోతి, వైయస్సార్సీపి మున్సిపల్ కౌన్సిల్ పక్ష నాయకులు బళ్ళ గంగయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్లు బందారు ఆనందప్రసాద్, బళ్ళ జోష్నారాణి, మున్సిపల్ కౌన్సిలర్లు కటకం ప్రసాద్, మెట్ల గోపి ప్రసాద్, బల్ల పద్మ సూర్యచంద్రరావు, బాబులాల్, సిరివెళ్ల జయేష్, కోమట్ల అనిల్, మెట్ల సుబ్రమణ్యం, ఉమ్మిటి తనుజ, తిప్పా పండు, పిచ్చిక సతీష్, కొసనం కరుణా కుమారి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వీరంకి నరసింహారావు, వైసీపీ పట్టణ అధ్యక్షులు బందారు మల్లికార్జునరావు, పెడన పట్టణ సచివాలయాల కన్వీనర్ మతిన్ ఖాన్, వార్డు ఇన్చార్జిలు వీర్నాల మాధవరావు, బళ్ళ సాంబశివరావు, వార్డు సచివాలయ కన్వీనర్లు పేరక నాగేశ్వరరావు, పతరాల పుష్ప, కారుపర్తి రాము, షేక్ నూరుద్దిన్, పేరిశెట్టి ముక్తేశ్వరరావు, చెన్నూరి పైడేశ్వరరావు, నల్ల నాగలక్ష్మి, పరసా రాము, ముత్యాల మురళి, కోడూరి శీను మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు వన్నెంరెడ్డి మహంకాళరావు, మాదాసు బాబురావు తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో పోలింగు శాతం పెంచేందుకు కార్యాచరణ

● డీపీఓ & స్వీప్ జిల్లా నోడల్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్






**ఏలూరు,కలంకౌంటర్ :** రానున్న ఎన్నికలలో పోలింగ్ శాతం పెంచేందుకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలు మేరకు కార్యాచరణ రూపొందించడం జరిగిందని దాని అమలులో భాగంగా జిల్లాలో అన్ని వర్గాల ఓటర్లతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, స్వీప్ నోడల్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో కమీషనర్ ఎస్. వెంకట కృష్ణ ఆధ్వర్యంలో స్వీప్ అవగాహనా సదస్సు ఏర్పాటు చేసారు. కార్యక్రమంలో చిరు వ్యాపారులతో పాటు నిర్ల క్ష్యానికి గురైన వర్గం, బ్రతుకుదెరువు కోసం కాగితాలు, గుడ్డలు ఎరుకొ ని జీవిస్తున్న వారితో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, స్వీప్ నోడల్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడారు. సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రంగం పోలింగ్ కేంద్రాల దగ్గిర అన్ని సదుపాయాలు కల్పించిందని అన్నారు.మెరుగైన ఓటింగ్ సౌలభ్యత కోసం, సమగ్రమైన ప్రజాస్వా మ్యాన్ని నెలకొల్పడం లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్నికల ప్రక్రి యలో పాల్గొనే అవకాశాన్ని కల్పించడంలో వికలాంగులు (పిడబ్ల్యుడి) మరియు 85 ఏళ్ల మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న ఓటర్లు ఇప్పుడు వారి ఇళ్ల నుండి ఓటు వేసే అవకాశం కల్పించడం జరుగుతు ందని డీపీఓ అన్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్లు మొత్తం పోలింగ్ స్టేషన్లు : 1,743 ఉంటే 409 పోలింగ్ స్టేషన్లో రాష్ట్ర పోలింగ్ శాతం కన్నా తక్కువ పోలింగ్ నమోదు అయ్యిందన్నారు. ఇప్పటికే పోలింగ్ శాతం పెంచే లక్ష్యంగా సన్నాహాలు జరిగాయాని దానిలో భాగంగా జిల్లా స్థాయి, మండల, గ్రామస్థాయిలో ఎప్పటికప్పుడు మహిళా సంఘాలతో, కాలేజీ విద్యార్థులతో, గిరిజనులతో, దివాంగులతో, మాజీ సైనికులతో, ఉద్యోగులతో, ఉపాధిహామీ వేతనదారులతో, భవిష్యత్ ఓటర్లతో ఇలా అనేక వర్గాల వారితో ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. అలాగే రానున్న ఎన్నికలు ఈ వి ఎం ద్వారా జరగనున్న సందర్భంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెరగడంతో పాటు, ఏథికల్ ఓటింగ్ జరగాలని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వారు సమకూర్చిన అప్లికేషన్లపై కూడా ఓటర్లకు అవగానా కల్పించడం జరిగిందని, దానిలో భాగంగా ముఖ్యమైన ఐ టి అప్లికేషన్లు నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్, సి-విజిల్ యాప్: (C VIGIL), సువిధ యాప్, ఓటర్ హెల్ప్ లైన్ యాప్, KYC యాప్ తదితర సాంకేతిక అంశాలపై కూడా ఓటర్లకు అవగాహన కల్పించడం జరిగిందని డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ఎన్నికల వ్యయ పరిమితులు ఉన్నందున పార్లమెంట్ సభ్యులు తరపు వ్యయ పరిమితి రూ. 95 లక్షలు, అసంబ్లీ తరపు వ్యయ పరిమితి రూ. 40 లక్షలు ఉన్నందున పరిమితులు లోబడి ఖర్చు చెయ్యాలని అన్నారు. సదస్సుకు అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొన్నారు, వారందిరితో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు

# నారాయణ సతీమణి రమాదేవి ఇంటింటి ప్రచారం



**నెల్లూరు, కలంకౌంటర్ :** నెల్లూరులోని42వ డివిజన్ లోని ఉన్నటువంటి వీధుల్లో తెలుగుదేశం, బిజెపి జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ,ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరి నారాయణ సతీమణి రమాదేవి,మాజీ ఆర్యవైశ్య జిల్లా మహిళా అధ్యక్షు రాలు మెంట కళ్యాణి గుప్తా, జనసేన నాయకురాలు విజయ ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లా డుతూ రాష్ట్రం అభివృద్ధి చెంది, మహిళల భవిష్యత్తు బాగుపడాల ంటే మరలా మనమందరం కలిసి చంద్రబాబు నాయుడు ని ముఖ్య మంత్రిగా చేసుకోవాలని అన్నారు. అప్పుడే రాష్ట్రం బాగుపడుతుందని మహిళలకు సూపర్ సిక్స్ పథకాల అమలు అవుతాయని ఆమె ఓటర్లకు తెలిపారు . ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జనసేన బిజెపి నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రంలో డ్రగ్స్ కల్చర్ పెరిగిపోయింది

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని



**అమరావతి,కలంకౌంటర్ :** బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని వైసీపీ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను లెక్క చేయకుండా వాలంటీర్స్‌ను వైసీపీ వాడుకుంటోందని, పోలీసులు కూడా ఈసీ కోడ్‌ను లెక్క చెయ్యకుండా ప్రవర్తిస్తున్నారని ఆరో పించారు. వైసీపీ పాలనలో అవినీతి, డ్రగ్ కల్చర్ పెరిగిపో యిందని ఆరోపించారు. విశాఖలో ఒక్కోటి 25 కేజీల బరువున్న వేయి సంచుల డ్రగ్స్ దొరకటం దారుణమ న్నారు. రాష్ట్ర పోలీసు శాఖ నిద్ర పోతోందని, ఢిల్లీ నుంచి వచ్చిన వారు అసలు విషయాన్ని బయటపెట్టారని సాధినేని యామిని విమర్శించారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారు తోందని, డ్రగ్స్ కల్చర్ విచ్చలవిడిగా మారిం దన్నారు. వాటి వల్లే మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపో యాయని, మి స్సింగ్ కేసులు ఎక్కువ అవుతున్నాయన్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరిపై కావాలనే నింద లు వేస్తున్నార న్నారు. ఎన్నికల్లో పురందేశ్వరి పరువు తియ్య టానికి వైసీపీ ప్రయత్నిస్తోందని అన్నారు. డైవర్షన్ పాలిట ిక్స్‌ను బీజేపీ ఖండిస్తుందన్నారు. ఓటమి భయ్యంతో వైసీపీ ఇలాంటి పనులు చేస్తోందని, అనవసరమైన నిందలు పురందేశ్వరిపై వేస్తే చర్యలు తప్పవని సాధినేని యామిని అన్నారు.

# మైలవరంలో టీడీపీ జెండా ఎగురవేస్తా :ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్

**విజయవాడ,కలంకౌంటర్ :** టీడీపీ మూడో జాబితాలో ఎన్టీఆర్ జిల్లా మైలవరం నుంచి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ టికెట్ దక్కించుకున్నారు. ఇటీవలే ఆయన వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఇక టీడీపీ మైలవరం టికెట్ దక్కించుకున్నసందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా పార్టీ అధినేత నారా చం ద్రబాబు నాయుడికి ధన్యవాదాలు తెలిపారు. "నాపై నమ్మ కం ఉంచి మైలవరం నియోజకవర్గ అసెంబ్లీ సీటు కేటా యించిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్ర బాబు నాయుడుకి ధన్యవాదాలు. మైలవరం నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా ఎగిరేలా నియోజక వర్గంలోని ప్రతిఒ క్క నాయకుడిని, కార్యకర్తలను సమన్వయపరుస్తూ నా ప్రయాణం కొనసాగిస్తానని వసంత కృష్ణ ప్రసాద్ ట్విటర్ వేదికగా చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

# సిట్టింగ్ స్థానంలోనే టికెట్ పొందిన లావు



**విజయవాడ, కలంకౌంటర్ :** పల్నాడు జిల్లా నరసరావుపేట పార్లమెంట్ నుంచి టీడీపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణ దేవరాయలుకు టికెట్ ఖరారయ్యింది. ఆయన ఇక్కడ సిట్టింగ్ ఎంపీ గా ఉన్నారు.' లావు' ఇటీవల అధికార వైసీపీ కి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఆయన తిరిగి నరసరావుపేట నుంచి పోటీకి దిగనున్నారు. వైసీపీ నుంచి మాజీ మంత్రి అనిల్ కుమార్ పోటీకి దిగడంతో వీరిమధ్య హోరాహోరీ పోరు జరగనుంది.

# శనివారం అర్ధరాత్రి శుక్రవారం పట్టపగలు కందుకూరు లో దొంగల హల్చల్

● విస్మయం చెందుతున్న పట్టణ ప్రజలు, ● భయబ్రాంతులకు గురి అవుతుంది బాధితులు.

**కందుకూరు,కలంకౌంటర్ :** నెల్లూరు జిల్లా కందుకూరు కనిగిరి రోడ్ లో పట్ట పగలు ఇద్దరు దొంగలు బరితెగించారు. వారంకితం కనిగిరి రోడ్ లోని రిలయన్స్ స్మార్ట్ పక్కన ఉన్న కనుమర్లపూడి శివరామకృష్ణ ఇంట్లో గత శనివారం అర్ధరాత్రి రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు నలుగురు దొంగలు బీభత్సం సృష్టించారు. బాధితులు ఈ విషయం మరువక ముందే శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల 20 నిమిషాల సమయంలో మరలా శివరామకృష్ణ ఇంట్లోకి ప్రవేశించి కత్తితో బెదిరించి 15 లక్షలు ఇవ్వకుంటే చంపుతామని భయబ్రాంతులకు గురిచేశారు. బాధితులు పెద్దగా కేకలు వేయడంతో క్రింద ఉన్న జనం పైకి రావడంతో జనానికి కత్తి చూపి బెదిరించి ద్విచక్ర వాహనంపై దర్జాగా మరొకరితో కలిసి పరారయ్యారు. గతంలో తీసుకొని వెళ్లిన నాలుగు సెల్ఫోన్లను బాధితులకు ఇచ్చి వెళ్లారు. మరల ఈరోజు ఉదయం 9 గం సమయంలో 4 సెల్ ఫోన్లు తీసుకొచ్చి ఇచ్చిన దుండగులు. అడ్డుబోపోయిన వారిపై కూడా దాడి చేయబోయి బైక్ పై పరారైన దుండగులు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి బాధ్యతలు నడిగి వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు. నెల్లూరు నుంచి ఫోర్న్ సిక్ నిపుణులు వచ్చి వేలిముద్రలు సేకరించారు. మరలా కాకుండాపోలీసులు దొంగలను తక్షణమే పట్టుకొని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# చేనేత కలంకారీ పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తా.. - కాగిత కృష్ణ ప్రసాద్



**పెడన (కృష్ణా జిల్లా),కలంకౌంటర్ :** చేనేత, కలంకారి పరిశ్రమల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని పెడన నియోజకవర్గ జనసేన బిజెపి పార్టీలు బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణములోని 7 మరియు 8 వార్డులలో ఇంటింటా తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో లోని అంశాలను ప్రజలకు వివరిస్తూ రాష్ట్ర భవిష్యత్తుకు ,అభివృద్ధికి తెలుగుదేశం పార్టీని బలపరచవలసిందిగా కోరుతూ ప్రచారం నిర్వహించారు. చేనేత,కలంకారి పరిశ్రమల నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కుతుందని కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బీసీల అభ్యున్నతికి దేశంలోనే బీసీ డిక్లరేషన్ ప్రకటించిన చరిత్ర తెలుగుదేశం పార్టీ జనసేనలకే దక్కుతుందని కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. రాబోవు కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈప్రచారంలో కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకుడు సాదరబోయిన ఏడుకొండలు ,మాజీ చైర్మన్ అబ్దుల్ ఖయ్యూం (హన్ను) పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యక్కల శ్యామలయ్య, 12వ వార్డు కౌన్సిలర్ మట్ట శివపావని మాజీ కౌన్సిలర్లు పరసా సూర్యనారాయణ బూసం ఆనందరావు, బెజవాడ నాగరాజు, ఎర్ర నాగరాజు తెలుగుదేశం పార్టీ నాయకులు ఊటుకూరి మోహనరావు, కారుపర్తి శ్రీనివాసరావు తమ్మా భీమయ్య, సమతం సత్యనారాయణ, గంగాధరరావు, ఉమ్మిటి అగస్త్యయ్య, ఎర్ర చిన్నబ్బి,వద్ది శ్రీనివాసరావు,వాసా కోట నాగేశ్వరావు, వద్ది పాములేటీ,బట్ట పూర్ణయ్య, కమ్మగంటి వెంకటేశ్వరరావు, వెలికట్ల ప్రసాదు, సేనాపతి అజయ్, పరసా జితేంద్ర, మహమ్మద్ హమీదుల్ల, కొనకళ్ల శివశంకర్, బిజెపి నాయకులు మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, కొల్లూరి రాధాకృష్ణ, జనసేన పార్టీ నాయకులు ప్రత్తిపాటి జయకృష్ణ, మట్ట నాని తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలు ఎలా ఉంటాయో..ఎవరు ఎలాంటివారో ఈ రోజు అర్థమైంది : ఉండవల్లి శ్రీదేవి

● తీవ్ర మనస్తాపంతో ట్వీట్ చేసిన ఉండవల్లి శ్రీదేవి



**విజయవాడ,కలంకౌంటర్ :** వైఎస్సార్‌సీపీ బహిష్కృత నాయకురాలు ఉండవల్లి శ్రీదేవికి బిగ్ షాక్ తగిలింది. తనను నమ్ముకుంటే ఎలా ఉంటుందో చంద్రబాబు మరోసారి చేసి చూపించారు. ఈ క్రమంలో ఉండవల్లి శ్రీదేవికి చంద్రబాబు హ్యాండ్ ఇచ్చారు. ఉండవల్లి శ్రీదేవి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చంద్రబాబు ఆమెకు అసెంబ్లీ సీటును కూడా ఆఫర్ చేశారు. తీరా ఎన్నికల సమయంలో వచ్చాక శ్రీదేవికి చంద్రబాబు షాకిచ్చారు. శ్రీదేవి అడిగిన మూడు స్థానాల్లో కూడా ఆమెకు సీటు ఇవ్వలేదు. బాపట్ల ఎంపీ, తిరువూరు, తాడికొండ శ్రీదేవి ఆశించారు. కానీ చంద్రబాబు మాత్రం ఈ మూడు సీట్లలో శ్రీదేవికి హ్యాండిచ్చారు. మూడు సీట్లలో వేరే వాళ్లకి సీట్ల ఇచ్చారు. దీంత, ఉండవల్లి శ్రీదేవి, ఆమె అనుచరులు చంద్రబాబు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నమ్మించి మోసం గొంతు చేశారంటూ శ్రీదేవి తన సన్నిహితుల వద్ద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. మనస్తాపంతో ట్వీట్ చేసిన ఉండవల్లి శ్రీదేవి : టీడీపీ మూడో జాబితా ప్రకటించిన అనంతరం తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి చేసిన ట్వీట్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాజకీయాలు ఎలా ఉంటాయో, ఎవరు ఎలాంటి వారో ఈ రోజు అర్థమైందని శ్రీదేవి పేర్కొన్నారు. అంతేకాదు.. బాపట్ల అని హ్యాష్ ట్యాగ్ పెట్టి కత్తి ఎమోజీ పోస్టు చేశారు. ఉండవల్లి శ్రీదేవి ఈ పోస్టులో ఏ రాజకీయ పార్టీ పేరును ప్రస్తావించనప్పటికీ, ఆమె చేసిన ట్వీట్ ప్రధాన ప్రతిపక్షం గురించే అని అర్థమవుతోంది. ఉండవల్లి శ్రీదేవి గత ఎన్నికల్లో వైసీపీ తరఫున శాసనసభ్యురాలిగా గెలిచారు. అయితే, వైసీపీలో ఇతర నేతలతో సఖ్యత చెడడంతో ఆమె టీడీపీకి దగ్గరయ్యారు. ఉండవల్లి శ్రీదేవి దళిత వర్గానికి చెందిన మహిళ కాగా ఈసారి ఎన్నికల్లో తిరువూరు (ఎస్సీ రిజర్వ్ డ్) అసెంబ్లీ స్థానం కానీ, బాపట్ల ఎంపీ స్థానం కానీ కేటాయిస్తారని ఆమె ఆశించారు. టీడీపీ ప్రకటించిన మూడో జాబితాలో బాపట్ల ఎంపీ స్థానానికి తెలంగాణ బీజేపీ నేత కృష్ణప్రసాద్ ను తీసుకువచ్చి పోటీ చేయిస్తున్నారు. ఈ పరిణామంతో ఉండవల్లి శ్రీదేవి తీవ్ర మనస్తాపానికి గురైనట్టు తాజా ట్వీట్ ద్వారా అర్థమవుతోంది.

# మర్యాద పూర్వక కలయిక





**నెల్లూరు,కలంకౌంటర్ :** ఆత్మకూరు టిడిపి అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి ని ఆయన నివాసం లో మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు,చీఫ్ ఆర్గనైజర్ కోట గురు బ్రహ్మం, ఈసీ నెంబర్ భువన సురేష్, నెల్లూరు అర్బన్ ఆర్య సంఘం అధ్యక్షులు కొండా ప్రవీణ్ శంకర్, రమేష్ తదితరులు సత్కరించారు.

# విజయసాయి రెడ్డికి స్వాగతం పలికిన బుర్రా



**కందుకూరు,కలంకౌంటర్ :** రాజ్యసభ సభ్యులు, నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి పెద్దలు వి. విజయ సాయి రెడ్డి కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధరరెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడుటకు మాచవరం విచ్చేశారు. ఈసందర్భంగా కందుకూరు నియోజకవర్గం వైయస్సార్ సిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువను బహుకరించి స్వాగతం పలికారు.

# ఐదు రోజుల బూట్ క్యాంప్, 24 గంటల ప్రోగ్రాం ప్రారంభించారు



**తిరువూరు (ఎన్ టి ఆర్ జిల్లా),కలంకౌంటర్ :** తిరువూరు శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగాల ఆధ్వర్యంలో బ్రెనోవిజన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారి సహాయ సహకారాలతో సంయుక్తంగా ఐదు రోజుల బూట్ క్యాంప్, 24 గంటల ప్రోగ్రాం ప్రారంభించారు . ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ బూట్ క్యాంపుకు చీఫ్ ట్రైనర్ యశస్వి సురభి బ్రెనోవిజన్ సొల్యూషన్స్, ఐదుగురు సిబ్బందితో హాజరయ్యారు. ఈ బూట్ క్యాంప్ లో 400 మంది విద్యార్థులు తర్ఫీదు పొందుతున్నారు. . ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాలలో తర్ఫీదునిచ్చి సక్రమంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. ప్రపంచంలో వస్తున్న సాంకేతిక విప్లవం కేవలం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మెషిన్ లెర్నింగ్ డేటా సైన్స్ విభాగాలలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

# 100రోజుల్లో డ్రగ్స్, గంజాయి ముఠాలపై ఉక్కుపాదం!

● ఎన్నికల ప్రచారంలో యువనేత లోకేష్



**మంగళగిరి,కలంకౌంటర్ :** విశాఖతీరంలో దేశంలోనే తొలిసారిగా 25వేల కిలోల డ్రగ్స్ పట్టుబడ్డాయన్న వార్తతో యావత్ భారతదేశం నివ్వెరపోయింది, జగన్ అండ్ కో ధనదాహంతో ఒకతరం నాశనమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని యువనేత నారా లోకేష్ ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి నియోజకవర్గం డోలాస్ నగర్ రచ్చబండ సభలో యువనేత లోకేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలోనే డ్రగ్స్, గంజాయి మాఫియాలు చెలరేగిపోతున్నాయి, విశాఖ,తూర్పుగోదావరి ఏజన్సీలో ఎమ్మెల్సీ అనంతబాబు నేతృత్వంలోనే గంజాయి మాఫియా రాష్ట్రంతోపాటు దేశంలోని ప్రధాన నగరాలకు గంజాయిని సరఫరా చేస్తోంది. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఏపిలోనే ఉండటం ఇందుకు నిదర్శనం. యువగళం పాదయాత్ర సందర్భంగా చంద్రగిరి లో ఓ తల్లి నన్ను కలిసింది, వైసిపినాయకులు తన బిడ్డను గంజాయికి బానిసగా మార్చి శారీరకంగా వాడుకున్నారని కన్నీరుమున్నీరైంది. తనబిడ్డను గంజాయి నుంచి బయటకి తేవడానికి సహాయం అందించాలని, లేకపోతే ఆమెను తన చేతులతోనే చంపేస్తానని ఆ తల్లి చెప్పింది, లేకపోతే తన ఇద్దరు బిడ్డలు కూడా గంజాయికి బానిసలుగా మారి తన దక్కరని ఆ తల్లి చెప్పిన మాటలు విని నేను తీవ్ర మనోవేదన చెందాను. ఆ తల్లికి వచ్చిన కష్టం రాష్ట్రంలో మరెవరూ రాకూడదని ఆనాడే నిర్ణయించుకున్నానని లోకేష్ పేర్కొన్నారు.

# మోడల్ కోడ్ అఫ్ కాండక్ట్ అమల్లో ఉన్నది - జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



**బాపట్ల,కలంకౌంటర్ :** 2024 సంవత్సరంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల ను దృష్టిలో పెట్టుకొని, ఎలక్షన్ కమిషన్ వారు ఇచ్చిన మోడల్ కోడ్ అఫ్ కాండక్ట్ అమల్లో ఉన్న నేపథ్యంలో, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుటకు పోలీస్ శాఖ వారు తీసుకుంటున్న ముందస్తు చర్యల గురించి మరియు ఎలక్షన్ ముగించే వరకు అభ్యర్థులు, నాయకులు ఏ విధంగా నడుచుకొని శాంతి భద్రతలకు సహకరించాలి అనే విషయం మీద జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పలు సూచనలు చేసినారు..

**సభలు సమావేశాల ఏర్పాట్ల కొరకు నియమావళి..** పార్టీ లేదా అభ్యర్థి స్థానిక పోలీస్ అధికారులకు ముందుగానే సభ నిర్వహించే ప్రదేశం, సమయాన్ని తెలియజేయాలని, సభ ఏర్పాటు విషయంలో నిషేధాత్మక లేక నిర్బంధాత్మక ఆదేశాలు ఉన్నాయా లేదా అనేది సరిచూసుకోవాలని, సభల్లో లౌడ్ స్పీకర్లు వినియోగించేందుకు ముందుగానే సంబంధిత అధికారికి లిఖితపూర్వకంగా అభ్యర్థన సమర్పించి అనుమతి పొందాలని, సమావేశాలు భగ్నం చేయడం లేదా మరో విధంగా శాంతిని భంగం కలిగిన విధంగా ప్రయత్నించే వ్యక్తులపై తప్పక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ర్యాలీలు నిర్వహించడానికి నియమావళి...** ర్యాలీ నిర్వహించే పార్టీ/అభ్యర్థి కార్యక్రమం ప్రారంభించే సమయం, ప్రదేశం, వెళ్లే మార్గం, ముగింపు సమయం, ప్రదేశం తదితర విషయాలను ముందుగానే నిశ్చయించుకోవాలని, దానికి అతిక్రమించకుండా కార్యక్రమం గురించి స్థానిక పోలీస్ అధికారులకు నిర్వాహకులు ముందుగానే తెలియజేసి ఊరేగింపు సాగే ప్రదేశాల్లో ఏవైనా నిర్బంధాత్మక ఆదేశాలు అమలులో ఉన్నాయా అనేది సరిచూసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు నిర్బంధాలను జాగ్రత్తగా అనుసరించాలని, అభ్యర్థులు వేరువేరు రాజకీయ పార్టీలు ఒకే మార్గంలో ఊరేగింపు తలపెట్టినప్పుడు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు తో సంప్రదింపులు జరపాలని, ఊరేగింపులో పాల్గొనే వ్యక్తులు ప్రమాదకర వస్తువులు వెంట తెచ్చుకోకుండా రాజకీయ పక్షాలు అభ్యర్థులు బాధ్యత వహించాలని, అలాంటి వస్తువులను అసాంఘిక శక్తులు దుర్వినియోగం చేసే అవకాశం ఉందని ఇతర రాజకీయ పార్టీల సభ్యుల, నాయకుల దిష్టిబొమ్మలను మోసుకెళ్లటం, దహనం చేయటం వ్యతిరేక ప్రదర్శన రూపాలను నిర్వహించకూడదని తెలిపారు.

**సాధారణ ప్రవర్తన నియమావళి ఇలా...** ఇతర రాజకీయ పార్టీల నాయకులు ఓట్లను పొందడం కోసం ఇదివరకే ఉన్న విభేదాలను మరింత పెంచేలాగా పరస్పర విద్వేషాన్ని రగిల్చే విధంగా కులాలు, జాతులు మధ్య మతపరమైన, భాషా పరమైన స్థానిక పరమైన ఉద్రేకాలను కలిగించే ఏ విధమైన కార్యకలాపాలను ఏ పార్టీ అభ్యర్థులు నిర్వహించరాదని, ఓట్ల కోసం కుల మతపరమైన, భావాలపరంగా అభ్యర్థన చేయకూడదని, ఓటర్లకు లంచం ఇవ్వటం, బెదిరించటం, ప్రలోభాలకు గురి చేయడం, అసలు వ్యక్తులు బదులుగా ఇతరులను ఓటరుగా చేయటం చేయకూడదని, ఎన్నికల ప్రచారం కోసం మసీదులు, చర్చిలు, దేవాదాయాలు మరే ఇతర ఆరాధన ప్రదేశాలను, పాఠశాలలను వేదిక ఉపయోగించకూడదని తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ర్యాలీలు నిర్వహించే పార్టీ అభ్యర్థి స్థానిక పోలీస్ అధికారుల వద్ద నుండి మీటింగ్ కి సంబంధించిన స్థలము, ఏర్పాటు, సమయం వంటి వాటి మీద అవసరమైన పర్మిషన్స్ తీసుకోవాలని, లౌడ్ స్పీకర్లు ఉపయోగ కొరకు కచ్చితంగా పర్మిషన్ తీసుకోవాలని, ప్రచార సమయంలో ఉపయోగించే వాహనాలు నియమ నిబంధనలకు లోబడి ఉపయోగించవలెనని, ఎన్నికల నియమాలలో ఏదైనా సమస్యలు ఉంటే సంబంధిత SP/SHO/DEO/RO/SO కి తెలియజేయవలెనని, ప్రచారంలో ఉపయోగించే వాహనాలన్నిటికీ సంబంధిత అధికారి యొక్క ధ్రువీకరణ పత్రంతో ఉపయోగించవలెనని, రోడ్ షోస్ ప్రదర్శించే వారు కచ్చితంగా ఎన్నికల నియమావళి నిబంధనకు లోబడి మాత్రమే పాటించవలెనని, ఓటర్లను ఆర్థికపరంగా మద్యం మరి ఏ ఇతర మార్గాల ద్వారా గాని ప్రభావితం చేయడానికి చూడకూడదని, ప్రాంత వర్గ కుల విభేదాలను ఎన్నికల సమయంలో రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించకూడదని, ఏదైనా కులాల మధ్య గాని, మతాల మధ్య గాని, వర్గాల మధ్య గాని ఘర్షణ పూరిత వాతావరణం తలెత్తేపనులను పూర్తిగా నిరోధించాలని, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో, విద్యలయాల్లో ఎలక్షన్ల ప్రచారం గానీ ప్రసంగాలు గాని పంపిణీలు గాని ఎన్నికల నేపథ్యంలో చేయకూడదని, ఇతర వ్యక్తులు లేక పార్టీలకు సంబంధించిన పోస్టర్స్ ను చించటం గాని, తొలగించడం గాని వంటి పనులు చేయకూడదని, ప్రభుత్వ స్థలాల్లో గాని లేదా ఏదైనా ప్రత్యేక ప్రదేశాల్లో గాని నియమావళి ఉల్లగించే చేష్టలకు తావివ్వకూడదని,ప్రత్యేకంగా ప్రైవేట్ స్థలాల్లో ఆ స్థలానికి సంబంధించిన యజమానికి సంబంధం లేకుండా నియమావళి ఉల్లగించే చేష్టలు చేయకూడదని, ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల లోపు ఖచ్చితమైన పర్మిషన్ లేకుండా పబ్లిక్ ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు ఉపయోగించరాదని, పోలింగ్ జరుగు ప్రదేశానికి 200 మీటర్ల దూరంలో ఉన్న ఆధ్యాత్మిక ప్రదేశాల్లో కానీ విద్య సంస్థలో గాని ఏ అధికారి కూడా తన స్తావరాన్ని ఏర్పాటు చేసుకోకూడదని తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వ్యక్తుల పైన IPC చట్ట ప్రకారం, Representation of the People Act, 1951 ప్రకారం మరియు PREVENTION OF DEFACEMENT OF PROPERTY ACT, 1985 ప్రకారం చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తదుపరి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలందరూ నిష్పక్షపాతంగా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని దీనికి కావాల్సిన ప్రతి విధమైన రక్షణ ఏర్పాట్లను పోలీస్ శాఖ తరపున శక్తి వంచన లేకుండా అందజేస్తామని ప్రజలు స్వేచ్ఛగా నిర్భయంగా తమ హక్కుని వినియోగించుకోవచ్చని తెలిపారు.



టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి విజయవాడ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా కేశినేని శివనాథ్(చిన్ని)ని టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించడంతో పట్టణంలోని బైపాస్ రోడ్డు నియోజకవర్గ తెలుగుదేశం కార్యాలయం దగ్గర బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్న తిరువూరుటిడిపి జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు..

**–తిరువూరు,కలంకౌంటర్ :**



తిరువూరులోని ఆంధ్రా–తెలంగాణ అంతరాష్ట్ర చెక్పోస్టును సందర్శించిన డీసీపీ కంచి శ్రీనివాసరావు, ఎసిపి మురళీ మోహన్..

**–తిరువూరు,కలంకౌంటర్ :**



తిరువూరు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు శుక్రవారం ద్రాక్ష రసం పంపిణీ చేశారు. సమితి కన్వీనర్ దామెర ప్రభాకర్ రావు, సభ్యులు పాల్గొన్నారు.

**–తిరువూరు,కలంకౌంటర్ :**



గంపలగూడెం మండలం నెమలి గ్రామంలో వాహనాలు తనిఖీలు చేపట్టిన సెబ్ అధికారులు.. తెలంగాణ నుండి అక్రమంగా తరలిస్తున్న 312 బీరు బాటిల్స్ స్వాధీనం, టాటా ఏస్ వాహనం సీజ్,ఇద్దరు అరెస్ట్..

**–తిరువూరు,కలంకౌంటర్ :**

# పెంచలకోన ఆలయంలో చంద్రబాబు ప్రత్యేక పూజలు





**నెల్లూరు,కలంకౌంటర్ :** టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెంచలకోన పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. పెనుశిల లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్రబాబును ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఉండవల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో గోనెపల్లి చేరుకుని అక్కడి నుంచి వాహనంలో పెంచలకోన చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న తర్వాత తిరిగి ఉండవల్లి బయలుదేరారు. ఆయన వెంట ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు రామకృష్ణ, హేమలత, సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

# ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రాష్ట్ర ఎన్నికల సంఘం ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పెండింగ్ లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 ల పరిష్కారం, ఎన్నికల ప్రచారం అనుమతులు, సి విజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం అమలు, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. అనంతరం వివిధ ఎన్నికల అంశాల నోడల్ అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పటిష్టవంతంగా అమలు చేయాలన్నారు. ఎన్నికల సంఘం అత్యవసర సేవల కింద ప్రకటించిన 33 కేటగిరీలకు చెందిన వారికి, అంటే ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు సిబ్బందికి, కేంద్ర ఎన్నికల సంఘం ఆథరైజేషన్ లెటరు కలిగిన మీడియా ప్రతినిధులు తదితరులకు పోస్టల్ బ్యాలెట్ జారి చేయుటకు ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ ఓటింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, హెూం ఓటింగ్ విధానం అమలకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సి విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులు నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో,



ఎన్నికలలో మద్యం, నగదు, వస్తు ప్రలోభాల అక్రమ రవాణా అరికట్టే అంశాల్లో స్టాటిక్ సర్వేలెన్స్ టీం లను అప్రమత్తం చేయాలన్నారు, ఎన్నికలకు సంబంధించిన అంశాలన్నింటిలో రోజువారి ఖచ్చితమైన నివేదికలు సకాలంలో పంపాలన్నారు. ఎన్నికలలో హింసాత్మక సంఘటనలు జరగకుండా పటిష్టమైన కట్టుదిట్టమైన పోలీసింగ్ అమలు చేయాలన్నారు. ఏఎస్పీ వెంకటేశ్వరరావు, డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, బందర్ ఆర్డీవో ఎం వాణి, పెడన నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ముడ విసి వెంకటరమణ, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# శివరామకృష్ణ కుటుంబానికి మద్దతుగా ఆర్యవైశ్య సంఘం







**కందుకూరు,కలంకౌంటర్ :** దొంగలు బీభత్సం సృష్టించి భయభ్రాంతులను చేసిన కలమర్లపూడి శివరామకృష్ణ కుటుంబానికి కందుకూరు మండల ఆర్యవైశ్య సంఘం అండగా నిలిచింది. కందుకూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వందలాదిమంది ఆర్యవైశ్యులు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద నుంచి పట్టణంలోని డీఎస్పీ ఆఫీస్ వద్దకు చేరుకుని కందుకూరు డిఎస్పి ఏ శ్రీనివాస్ ను కలసి కనుమలపూడి శివరామకృష్ణ ఇంట్లో దొంగతనం చేసి, బీభత్సం సృష్టించి, మరలా శుక్రవారం ఉదయం 9 గంటలకు శివరామకృష్ణ ఇంటికి వచ్చి కత్తి చూపించి భయభ్రాంతులను చేసి 15 లక్షల ఇమ్మని లేకుంటే చంపుతామని బెదిరించి మోటార్ సైకిల్ పై పరారైన దొంగలను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని డీఎస్పీకి మండల ఆర్యవైశ్య సంఘం తరఫున నగర ఆర్యవైశ్యులందరూ సంతకాలు చేసి డీఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి బాధితులు శివరామకృష్ణ దంపతులను అడిగి కొన్ని వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ దొంగలను రెండు మూడు రోజుల్లోనే పట్టుకుంటామని, బాధితుల ఇంటి వద్ద ఇద్దరు పోలీసులను కాపులాగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలోఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పబ్బిశెట్టి శివ, ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి శ్రీకాంత్, డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి కోట వెంకట నరసింహం, వాసవి సేవాదాల అధ్యక్షులు, వాసవి సేవాదళ్ అధ్యక్షులు చీదేళ్ల వేణుగోపాలరావు,ఆర్యవైశ్య మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు, వైస్ ప్రెసిడెంట్ బొగ్గవరపు నరసింహ, మురారి శెట్టి శ్రీను, మాజీ ఏఎంసీ చైర్మన్ మురారి శెట్టి వెంకట సుబ్బారావు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రెసిడెంట్ కొత్త వెంకటేశ్వర్లు, సోమేశ్వరాలయ చైర్మన్ మోదడుగు నరసింహం, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ రవ్వా శ్రీనివాసులు, ఇస్కాల మధు, చీదెండ్ల సోమశేఖర్,మురారిశెట్టి సుధీర్,చేగు శేషారావు, గుర్రం అల్లూరయ్య తదితర వందలాదిమంది నగర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపిన ప్రిన్సిపల్, మంచిరాజు మురళి, శీలం సుధీర్

**కందుకూరు,కలంకౌంటర్ :** బెంగుళూరులోని న్యాక్ కార్యాలయం విడుదల చేసిన ఫలితాల్లో స్థానిక టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏ-ప్లస్ (A) గ్రేడును కైవసం చేసుకుంది. ఫిబ్రవరి 14 మరియు 15వ తేదీల్లో కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం కళాశాలలో అమలవుతున్న బోధనా పద్ధతులను, పరిశోధన సామర్థ్యాన్ని, మౌలిక వసతులను, విద్యార్థుల యొక్క క్రీడా, సాంస్కృతిక విద్యాపరమైన సామర్థ్యాలను, కళాశాల పరిపాలనను, నాయకత్వాన్ని, కళాశాలలో చేపట్టిన హరిత కార్యకలాపాలను, పర్యావరణ అనుకూల విద్యను, సమాజానికి విద్యార్థులను ఉద్యోగాలకు, సమాజానికి దగ్గరగా తీసుకోవడంలో కళాశాల చూపుతున్న చొరవను పరిశీలించి కళాశాలకు ఏ-ప్లస్ గ్రేడ్ ఇవ్వడం జరిగింది. వాస్తవానికి న్యాక్ బృందం గత సంవత్సరం మే నెలలో కళాశాలను సందర్శించి B++ గ్రేడును కేటాయించింది. చేసిన కృషికి సరైన ఫలితం లభించకపోవడంతో, కళాశాల విద్యా శాఖ కమీషనర్ ప్రోత్సాహంతో, ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.రవికుమార్ గ్రేడ్ పునఃపరిశీలనకై న్యాక్ ప్రధాన కేంద్రానికి అప్పీలు చేశారు. ఈ విధంగా రాష్ట్రంలోనే న్యాక్ బృంద పునఃపరిశీలనకు అప్పీలు చేసిన మొట్టమొదటి కళాశాలగా కందుకూరు కళాశాల నిలిచింది. 3.44 అత్యధిక స్కోరుతో ఏ-ప్లస్ సాధించిన మొట్టమొదటి కళాశాలగా టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల- కందుకూరు నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.రవికుమార్ ఈ విజయానికి కృషి చేసిన ఐక్యుఏసి (IQAC) విభాగాధిపతి డాక్టర్ పి. రాజగోపాల్ బాబు ని, విద్యార్థినీ విద్యార్థులను,




అధ్యాపక బృందాన్ని, అధ్యాపకేతర సిబ్బందిని, పూర్వ విద్యార్థులను మరియు దాతలను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల మౌలిక వసతుల అభివృద్ధికి కోటి రూపాయలతో దాతల సహకారాన్ని అందించిన కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి కి ప్రిన్సిపాల్ రవి కుమార్, నాకు సాధన కమిటీ సభ్యులు మంచిరాజు మురళీమోహన్, శీలం సుధీర్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తమ విజయానికి సహకరించిన కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ని, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్.తులసి గారిని, కళాశాల విద్యాశాఖలో పనిచేయుచున్న అకడమిక్ సెల్ అధికారులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. తమ కళాశాల మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తూ విద్యార్థినీ విద్యార్థులకు అత్యున్నత బోధనను అందిస్తూ, వారిలో ఉన్న అన్ని రకాల సామర్థ్యాలను వెలికితీస్తుందని తెలిపారు. తద్వారా వారు జీవితంలో స్థిరపడటమే కాక, సమాజ అభివృద్ధిలో కూడా పాలుపంచుకుంటారని, కందుకూరు మరియు పరిసర ప్రాంతాల విద్యార్థినీ విద్యార్థులు తమ టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి, కళాశాల అందిస్తున్న అన్ని సౌకర్యాలను ఉపయోగించుకొని, తమ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ప్రిన్సిపాల్ సందర్భంగా కోరారు.

# వ్యూహాత్మకంగా ప్రచారం

● జనసేన ఇంచార్జి హెూటల్ లో పేర్ని కిట్టు ప్రచారం









**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రాజకీయాల్లో ప్రత్యేకించి ఎన్నికల్లో రాణించాలంటే వయసు.. అనుభవం... ఆస్తులు కంటే వ్యూహం.. ప్రజలతో మమేకం అవడం... ప్రజలతో వినయంగా ఉంటూ.. ప్రతి సెకన్ విలువైనదిగా భావించి ప్రచారం చేసుకోవడం.. పార్టీ క్యాడర్ ను కలుపుకుపోవడం.. ప్రతికూల పరిస్థితి సైతం సానుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేయడం....ఇవి కీలకం.. వీటిని తూ. చ. తప్పకుండా వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు అమలు చేస్తున్నారు. జనసేన నియోజకవర్గం ఇంచార్జి బండి రామకృష్ణ హెూటల్ లో కార్మికులతో మాట్లాడి మద్దతు కోరిన వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉదయం ఆర్కే గుడ్ టైమ్స్ హెూటల్ లో కిట్టు ప్రచారం ఆసక్తి కరమైన చర్చ కు దారితీసింది. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న పేర్ని కిట్టు... అడుగడుగునా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఆశీర్వదించండి.. మన బందరు అభివృద్ధికి... ప్రజా సంక్షేమానికి కట్టుబడి వుంటాను అంటూ.. ఆలోచింపజేసే విధంగా ఎన్నికల ప్రచారం లో వైసీపీ శ్రేణుల్ని కలుపుకుంటూ దూసుకెళ్తున్న పేర్ని కిట్టు.ప్రచార పర్వంలో వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టు ముందంజ లో వున్నారు. అనుభవం లేదు.. వయసులో చిన్నోడు అంటూ ప్రతిపక్షాలు చేస్తున్న కామెంట్స్ కి రాత్రింబగళ్లు కష్టపడుతూ తన పనితీరు ద్వారా కిట్టు మార్క్ చూపిస్తున్నాడని సీనియర్ రాజకీయ నేతలు వ్యాఖ్యనిస్తున్నారు.

# మత్స్యకార కుటుంబాలకు అండగా నిలిచింది తెలుగుదేశం పార్టీ : దామచర్ల సత్య

**టంగుటూరు,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే మత్స్యకార కుటుంబాలు సంతోషంగా జీవించాలని టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. మన గ్రామానికి మన సత్యన్నకార్యక్రమంలో భాగంగా రెండో రోజు టిడిపికి కాబోయే ఎంపీ అభ్యర్థి మాగుంటరాఘవరెడ్డి తో కలిసి టంగుటూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా దామచర్ల సత్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు సబ్సిడీపై పెట్రోల్ అందించారని వేట నిషేధంలో ప్రోత్సాహక నగదు అందించాలని గుర్తు చేశారు. మత్స్యకార కుటుంబాలకు వైఎస్ఆర్సిపి ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా స్వామిని ఎంపీ అభ్యర్థిగా రాఘవరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సత్యా పిలుపునిచ్చారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి చేయని మంత్రి సురేష్ బాబు కొండేపి నియోజకవర్గం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాలంటీర్లకు ఉద్యోగులకు తాయిలాలు పంచడంలోనే బిజీగా గడుపుతున్నారని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా కుతంత్రాలు పండిన కొండపి నియోజకవర్గం ప్రజలు ఎమ్మెల్యే స్వామిని మూడోసారి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ మాగుంట కుటుంబం గత 30 సంవత్సరాలుగా ప్రకాశం జిల్లా ప్రజలతో మమేకమై ఉందని గుర్తు చేశారు. తమ కుటుంబం ఎల్లప్పుడూ అవినీతికి తావు లేకుండా ప్రజా సేవ చేసిందన్నారు. 2024 మే లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామిని హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. తాను ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా నిలుచుంటున్నారని తనని కూడా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండపి నియోజకవర్గం పరిశీలకులు అడక స్వాములు, మండల పార్టీ అధ్యక్షులు విజయకుమార్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, సీనియర్ నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, జనసేన కోఆర్డినేటర్ కనపర్తి మనోజ్ కుమార్, గ్రామ నాయకులు భాస్కర్ తో పాటు పలు గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# వైజాగ్ డ్రగ్ మాఫియా లో జగన్, విజయసాయి హస్తం

● దొరికి పోయామనే సోషల్ మీడియాలో తెదేపా నేతలపై ఆరోపణలు. ● నెల్లూరు పార్లమెంట్ కు పోటీ చేస్తున్న విజయ సాయి రెడ్డి ని ఓడిస్తాం. ● బెజవాడ ప్రసాద్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.



**కందుకూరు,కలంకౌంటర్ :** వైజాగ్ పోర్ట్ లో సి బి ఐ కి దొరికిన దాదాపు 50 లక్షల విలువైన డ్రగ్స్ వెనక రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, ఎంపి విజయ సాయి రెడ్డి హస్తం వుందని, అడ్డం గా దొరికిపోయామనే బయం తోనే తెదేపా నేతల పై వైసిపి సోషల్ మీడియాలో ఆరోపణలు చేస్తున్నారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ అన్నారు.ఇంటర్పోల్ ద్వారా వచ్చిన సమాచారం మేరకు సీబీఐ అధికారులు తనికీ చేస్తుంటే డ్రగ్స్ వున్న కంటెయినర్ తనిఖీ చేయకుండా కొందరు రాష్ట్ర ఉన్నాతాధికారులు అడ్డుపడ్డారని సీబీఐ తన నివేదికలో పేర్కొందని, మత్తు పదార్థాలున్న కంటెయినర్ ని తనిఖీ చేస్తుంటే రాష్ట్ర అధికారులు అడ్డు పడాల్సిన అవసరం ఏంటనీ, దీని వెనక వున్న పెద్దలు ఎవరో బయటకు తీయాలని, రాష్ట్ర రాజధాని చేస్తామంటూ సిటీ ఆఫ్ డెస్టినీ నీ కాస్త సిటీ ఆఫ్ డ్రగ్ గా వైకాపా నేతలు చేశారని, విశాఖ ను పరిపాలన రాజధానిగా కాదు డ్రగ్స్ రాజధాని గా చేసిన ఘనత జగన్ రెడ్డికే దక్కుతుందనీ, ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్ ని జగన్ రెడ్డి దిగజార్చాడని, విశాఖ నగరాన్ని గంజాయి ఎగుమతుల్లో, డ్రగ్స్ దిగుమతుల్లో నెంబర్ వన్ చేసాడనీ, యువత భవితను నాశనం చేసాడనీ బెజవాడ ప్రసాద్ తీవ్ర ఆరోపణలు చేశాడు, ఈ డ్రగ్స్ దిగుమతి చేసుకున్న సంధ్య అక్వా అధిపతి వీరభద్రరావు కు విజయ సాయి రెడ్డి కి దగ్గర సంభందాలు వున్నాయని, సాయి రెడ్డి డైరక్టర్ గా విహంగ ల్యాబ్స్ , కైలాష్ ల్యాబ్స్ 2019లో మొదలయ్యాయనీ, 2020 లో విజయ సాయిరెడ్డి కంపెనీ విహంగ ల్యాబ్స్ లో ఈ సంధ్య వీరబద్ర రావు డైరక్టర్ గా చేరాడనీ, ఆతర్వాత సంధ్య అక్వా బిజెనెస్ కూడా బాగా పెరిగిందనీ, వీటిని బట్టి చూస్తుంటే ఈ డ్రగ్స్ దిగుమతి వెనక సాయి రెడ్డి హస్తం అర్థమవుతుందని, యువత జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్ మాఫియా వెనక వున్న విజయ సాయి రెడ్డి నెల్లూరు పార్లమెంట్ కు వైసిపి నుండి పోటీ చేస్తున్న నేపథ్యం లో ప్రజలు ఓడించి తగిన బుద్ధి చెప్పాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ నెల్లూరు పార్లమెంటరీ ప్రజలను కోరారు.

# గడపగడపకు సూపర్ సిక్స్ పథకాలను చేర్చాలి : ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

**కందుకూరు,కలంకౌంటర్ :** ఇటీవల మహానాడులో చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలని కొండపి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి కోరారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఆయన శుక్రవారం బూత్ ఇన్చార్జిలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి జనసేన బిజెపి కూటమి అభ్యర్థులు గెలవడం తధ్యమన్నారు. అస్తవ్యస్తమైన పరిపాలనను గాడిలో తేవాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారని తెలిపారు. ఈ పథకాల ద్వారా మహిళలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని స్వామి తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు యువగళం నిధి ద్వారా ఉద్యోగం వచ్చేవరకు నెలకి మూడు వేల రూపాయలు నిరుద్యోగ భృతి అందించడం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్రవ్యాప్తంగా బీసీలపై దాడులు పెరిగాయని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కామాక్షయ్య, బ్రహ్మయ్య తో పాటు బూత్ ఇన్చార్జులు, యూనిట్ ఇన్చార్జులు పాల్గొన్నారు



Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com